క్లుప్తంగా

ధ్రువపత్రాల జారీకి దళారులను నమ్మొద్దు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు దళారులను నమ్మవద్దంటూ కార్యాలయ ఆవరణలో పలుచోట్ల శుక్రవారం నోటీసులు అతికించారు. ఇటీవల బీసీ వృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా భావించిన దళారులు ‘మేము త్వరగా పనులు చేయిస్తామని అమాయకుల నుంచి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు వసూలు చేశారు. ఎంతకీ ధ్రువపత్రాలు జారీ కాకపోవడంతో మోసపోయామని తెలుసుకుని కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో కార్యాలయానికి వచ్చేవారు నేరుగా సిబ్బందినే ఆశ్రయించాలని పేర్కొంటూ నోటీసులు అతికించారు. ఒకవేళ ఎవరైనా దళారులు మీ వద్దకు వస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



దుండిగల్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

నోటు పుస్తకాల పంపిణీ

సుభాష్‌నగర్: సమాజంలో మంచి మార్పు రావాలంటే చదువుతోనే సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 50వేల నోట్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. విద్యార్థికి 5 పుస్తకాలు అందిస్తామని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ రోడామేస్త్రీనగర్‌కు చెందిన నవాబ్‌మియాకు ముగ్గురు కుమారులు. వారి చిన్నకుమారుడు ముస్తాక్(36) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కొద్ది రోజులుగా ముస్తాక్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పిల్లలతో మాట్లాడిన ముస్తాక్ బాత్రూంకు వెళ్లాడు. అనంతరం తిరిగి బెడ్‌రూంలోకి వెళ్లి గడియపెట్టుకున్నాడు. గంటైనా తలుపులు తెరవడకపోవడంతో అనుమానం వచ్చిన భార్య తలుపు తట్టగా ఎంతకూ తీయలేదు. ముస్తాక్ సోదరుడు ముస్తాద్ సహాయంతో తలుపులు తెరచి చూడగా ముస్తాక్ మృతి చెంది ఉన్నాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య తస్లిమా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్లు దొంగలిస్తున్న ఇద్దరి అరెస్టు


నిందితులు

సుభాష్‌నగర్: మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని సూరారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. సీఐ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. సూరారం కాలనీ ముత్యాల బస్తీకి చెందిన చంద్రశేఖర్ (19), రోహన్ (21) లు స్నేహితులు. చంద్రశేఖర్ బైక్ మెకానిక్‌గా పని చేస్తుండగా, రోహన్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం సాయిబాబానగర్ చౌరస్తాలో వీరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి వద్ద దొంగలించిన సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించారు.

పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ దాడి

• 14 మంది జూదరుల అరెస్టు

సుభాష్‌నగర్: పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్టు చేసిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారంకాలనీ రెండో హోం జెండా వద్ద జి.అయ్యప్పరెడ్డి అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా తన ఇంట్లో పేకాట ఆడిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు గురువారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న14మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ.74వేలు, 14 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

కొనసాగుతున్న గోదావరి పైపులైన్ పనులు



ఇక ఇంటింటికీ గోదారమ్మ

నిజాంపేట్ కార్పొరేషన్‌లో తీరనున్న తాగునీటి కష్టాలు

6ఎంఎల్ (60 లక్షల లీటర్ల) ట్యాంక్ నిర్మాణం



- తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సంపు నిర్మాణం
- తుది దశకు చేరిన నిర్మాణ పనులు • సంపు సామర్థ్యంలో 60 లక్షల లీటర్లు
- జోరుగా సాగుతున్న పైపులైన్ కనెక్షన్ పనులు
- త్వరలో గోదావరి జలాల సరఫరాను ప్రారంభిస్తామన్న అధికారులు

నిజాంపేట్: మరో రెండు నెలల్లో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు గోదావరి జలాలు రానున్నాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు దుండిగల్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలకు సైతం తాగునీటి కష్టాలు తీరనున్నాయి. బాచుపల్లి సాయినగర్ సమీపంలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్మించిన నూతన సంపు నిర్మాణం తుది దశకు చేరింది. ప్రస్తుతం పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి.

ఎకరన్నర స్థలంలో సంపు నిర్మాణం

బాచుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.186లో సుమారు ఎకరన్నర స్థలంలో ఈ సంపు నిర్మాణం చేపట్టారు. 6ఎంఎల్ (60 లక్షల లీటర్ల) నీరు నిల్వ ఉండే విధంగా డిజైన్ చేశారు. రూ.9 కోట్ల నిధులతో సంపు నిర్మాణ పనులను సంవత్సరన్నర కాలంగా చేపడుతున్నారు. భవిష్యత్ తరాలకు సైతం నీటి కష్టాలు లేకుండా ముందు చూపుతో ఈ నిర్మాణం చేపట్టారు.

ఓఆర్ఆర్ ఫేజ్–2 పనుల్లో భాగంగా..

◆ ఇక ఇప్పుడు మాత్రం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లోని కాలనీతో పాటు భౌరంపేట్ ప్రాంతానికి సైతం నీటి కష్టాలు తీరనున్నాయి. ఓఆర్ఆర్ ఫేజ్–2 పనుల్లో భాగంగా ఇక్కడ ఈ సంపు నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాలకు గోదావరి జలాలు..

ప్రస్తుతం నిర్మాణం చివరి దశకు చేరిన ఈ సంపు నుంచి నీటిని ప్రగతినగర్ ప్రాంతాల్లోని ఆర్‌కే లేఅవుట్, ఎన్‌ఆర్‌ఐ కాలనీ, వాసవీ లేఅవుట్, జగన్ స్టూడియో ప్రాంతంతో పాటు మరికొన్ని కాలనీలకు సరఫరా చేస్తారు.

◆ అదే విధంగా బాచుపల్లిలోని సాయినగర్, ఆదిత్య గార్డెన్స్‌కాలనీ, బాచుపల్లి చౌరస్తా వరకు ఉన్న ప్రాంతాలకు ఇక్కడి నుంచి నీటి సరఫరా ఉంటుంది.

భౌరంపేట్ నుంచి ఇక్కడకు పంపింగ్...

భౌరంపేట్ నుంచి బాచుపల్లి సాయినగర్ సమీపంలో నిర్మిస్తున్న సంపులోకి గోదావరి జలాలను పంపింగ్ చేస్తారు. ఇక్కడి నుంచి తిరిగి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలు, ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తారు.

◆ అదే విధంగా నిజాంపేట్‌కు అత్యవసరం అయినప్పుడు ఇక్కడి నుంచి నీటి సరఫరా చేసేందుకు సైతం ఏర్పాట్లు చేశారు. కాని రెగ్యూలర్‌గా నిజాంపేట్‌కు నీటి సరఫరా ఉండదు. అదే విధంగా భౌరంపేట్ ప్రాంతానికి సైతం ఇక్కడి నుంచే నీటి సరఫరా ఉంటుంది.

గతంలో ఇక్కడ తీవ్ర నీటి ఎద్దడి..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వేసవిలో అయితే ఆ కష్టాలు అన్ని ఇన్ని కావు. అపార్ట్‌మెంట్‌వాసులు ట్యాకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి. మురికివాడ ప్రాంతాల ప్రజలైతే నాలుగైదు రోజులకు ఒకసారి వచ్చే నీటితో తమ అవసరాలను తీర్చుకుంటున్నారు.

రెండు నెలల్లో అందుబాటులోకి..



నీటి సరఫరా ఎక్కడెక్కడ జరగాలనే దానిపై ప్లానింగ్ చేశాం. ప్రజలకు ఎక్కడ, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో అనే అంశాలను పరిగణలోకి తీసుకున్నాం. అందుకు తగ్గట్టుగానే నీటి కనెక్షన్ల కోసం పైప్‌లైన్లు వేస్తున్నాం. మరో రెండు నెలల్లో ప్రజలకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– సంతోష్‌కుమార్, జీఎం, హెచ్‌ఎండబ్ల్యూఎస్

చాలా సంతోషంగా ఉంది...



నూతనంగా నిర్మించిన సంపు పనులు పూర్తికావడంతో మాకు నీటి కాష్టాలు తీరుతాయని చాలా సంతోషంగా ఉంది.నీరు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు పడే వాళ్లం ఇప్పుడు గోదవరి జలాలు ఇక్కడకు రావడంతో మాకు ఇక నీటి కష్టాలు ఉండవనే నమ్మకం ఉంది.ఎంత త్వరగా నీటిని ఇస్తే అంత బాగుంటుంది.

– భారతి, సాయినగర్

నీళ్లు రావాలని కోరుకుంటున్నాం



ప్రజలకు ఇంటింటికి నీళ్లు రావాలని కోరుకుంటున్నాం.ముఖ్యంగా పేద ప్రజలు నివసించే మురికి వాడ కాలనీకు ప్రతి రోజు నీరు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. సాయినగర్ కాలనీలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిని ట్యాంకర్ల ద్వార కొనే శక్తి లేని పేదలు నివసించే ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

– కాసాని శిరీష, కార్పొరేటర్

నీట కష్టాలు తీరనున్నాయి



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లోని పలు కాలనీల ప్రజలకు నీటి కష్టాలు త్వరాలోనే తీరనున్నాయి.తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇంటింటికి నీటిని అందించాలనే లక్ష్యంతో పని చేస్తుంది.అందులో భాగంగానే ఈ నూతన సంపు నిర్మాణం జరిగింది.

– కొలను నీలారెడ్డి, నిజాంపేట్ మేయర్

చిచ్చర పిడుగు

స్కేటింగ్, విలువిద్యలో ఉత్తమ ప్రతిభ


శాన్వి దెబల

కుత్బుల్లాపూర్: బాల్యంలోనే అపారమైన ప్రతిభతో పాటు చక్కటి నైపుణ్యంతో స్కేటింగ్, విలువిద్య పోటీల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది చిన్నారి శాన్వి దెబల (8). అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన స్కేటింగ్, విలువిద్య పోటీల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. కుత్బుల్లాపూర్ నియోజవర్గం గాజులరామారం ప్రాంతానికి చెందిన చెందిన ఎనిమిదేళ్ల శన్వి దెబల ఈనెల 17 ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా, ఏపూరి బ్రదర్ హుడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జాతీయ బాల ప్రతిభా పురస్కారం, బంగారు అశోక చక్ర అవార్డును అందుకుంది. ఐసీడీఎస్ పిడి ఉమా, బాలల సంక్షేమ అధికారి వేమా రామాంజనేయులు, లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా సెక్రటరీ బుచ్చేశ్వర రావు, గ్రేస్ ఫౌండేషన్ డైరెక్టర్ శాలెం రాజు, బాపట్ల సీడీపీఓ గుంటూరు మనోహర శర్మలు వేడుకల్లో పాల్గొని చిన్నారిని ప్రశంసించారు. బూమ్స్ అకాడమీలో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిల్లో రాణిస్తున్న చిన్నారిని కోచ్ కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

బీసీ రుణాలకు తక్కువ గడువు ఇవ్వడం దారుణం

బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీసీ కులాలకు, చేతివృత్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సాయం దరఖాస్తుల గడువును పొడిగించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాజులరామారంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతి వృత్తుల కులాల కోసం తీసుకువచ్చిన పథకానికి దరఖాస్తులకు కేవలం 14 రోజుల గడువు ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి 14 రోజులకు మించి సమయం పడుతుందన్నారు. బీసీలంతా ఈ పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి రెవెన్యూ కార్యాలయాల వద్ద పడికాపులు కాయాల్సి వచ్చిందన్నారు.

◆ ఒక పక్క రెవెన్యూ కార్యాలయంలో సర్వర్లు మొరాయిస్తున్నాయని.. అన్ని సక్రమంగా పనిచేసినప్పుడు అధికారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం బీసీ జాబితాలోని అన్ని కులాలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

◆ బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికలు వస్తున్నాయనే బీసీలు గుర్తొచ్చారని విమర్శించారు. బీసీ కులాలను కేసీఆర్ ఎన్నికల్లో పావుగా వాడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బంధు పేరిట దళితులను మోసం చేసినట్టే, లక్ష రూపాయల ఆర్థిక సాయమంటూ బీసీలను కూడా కేసీఆర్ మోసం చేస్తారని పేర్కొన్నారు.

◆ రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే 130 కులాల్లో రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, జిల్లా ఉపాధ్యక్షులు బావిగడ్డ రవి, నాయకులు దుర్యోధన్‌రావు, రాజిరెడ్డి, సంగీతా పాత్ర తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ పాడైంది.. ట్రాఫిక్ జామైంది!


దూలపల్లి నుంచి కొంపల్లి, బహోదుర్‌పల్లి, జీడిమెట్లకు వెళ్లే దారుల్లో భారీగా నిలిచిన వాహనాలు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం సుమారు 4 గంటల నుంచి ట్రాఫిక్ ఏర్పడింది. రోడ్డు ఇరువైపులా కిలోమీటర్ల మీద వాహనాలు నిలిచిపోయాయి. ఒకవైపు రోడ్డు వెడల్పు పనులు, మరోవైపు వారాంతపు సంతతో పాటు ఒకేసారి పదుల సంఖ్యలో కాలేజ్ బస్సులు, జీడిమెట్ల ఇండస్ట్రీలోకి వెళ్లే వాహనాలు రావడం.. దీనికి తోడుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద సిగ్నల్ పనిచేయకడం పోవడంతో ఈ సమస్య తలెత్తింది. రోడ్డు పనులు, సెయింట్ మార్టిన్ కాలేజ్ వద్ద బ్రిడ్జి పనులు జరుగుతున్న నేపథ్యంలో కొన్ని రోజుల పాటు అధికారులు భారీ వాహనాలను వేరే మార్గం గుండా మళ్లిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ వినాయకనగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా శిథిలమైన విద్యుత్ పోల్స్, శానిటేషన్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన భరతసింహారెడ్డి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే కొత్త పోల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీ నాయకులు మురళీకృష్ణ, మహమ్మద్ అబీద్, అంజయ్య, శీను, పండిత్ మిశ్రాజి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణ పనులు షురూ

దుండిగల్: దుండిగల్‌లోని శ్రీ పోచమ్మ తల్లి ఆలయ స్లాబ్ నిర్మాణ పనులను శుక్రవారం వైస్ చైర్మన్ పద్మారావు కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మాణ పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు

నిజాంపేట్: వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా డ్రెయిన్‌లు, నాలాల్లోని వ్యర్థాలను తొలగిస్తున్నామని కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ మర్తా వాణిప్రసాద్ అన్నారు. ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న వర్షపు నీటి నాలాను శుక్రవారం ఆమె పరిశీలించారు. వర్షాలతో ప్రగతినగర్ మెయిన్ రోడ్డులోని కమాన్ వద్ద నీరు నిలుస్తోందన్నారు. ఏఈ లక్ష్మీనారాయణతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించానని ఆమె తెలిపారు. వరద నీరు సాఫీగా వెళ్లేలా వ్యర్థాలను తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

మిషన్ కాకతీయ పథకం పెద్ద స్కామ్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి


గుర్రపు డెక్కతో నిండిన ఎన్నాచెరువును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: మిషన్ కాకతీయ పథకం పెద్ద స్కామ్ అని... చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పేరిట వేలాది కోట్ల రూపాయలను కేసీఆర్ కుటుంబం కాజేసిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన జీడిమెట్ల డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వెన్నలగడ్డలోని ఎన్నా చెరువును పరిశీలించిన ఆయన చెరువు మొత్తం గుర్రపు డెక్కలో నిండిపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు.

◆ గతంలో ఎంతో మందికి తాగునీరు, పొలాలకు సాగునీటిని అందించిన చెరువు నేడు కబ్జా కోరల్లో చిక్కుకుందన్నారు. తూతూ మంత్రంగా చెరువులో గుర్రపు డెక్కను తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులోకి చుట్టు పక్కల కాలనీల డ్రైనేజీ నీరు చేరడం తోనే ఈ పరిస్థితి తలెత్తుతోందని అన్నారు. మిషన్ కాకతీయ పథకం నిధులతో ఎన్నా చెరువును సుందరీకరించాలని భూపతిరెడ్డి డిమాండ్ చేశారు.

◆ చెరువులో అపరిశుభ్ర వాతావరణంలో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెరువును సుందరీకరించేలా స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సదానందం, మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ కో–ఆర్డినేటర్ సమీర్ ఖాన్, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ యువజన అధ్యక్షుడు ఇరుగు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



సుభాష్‌నగర్: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన అభివృద్ధి నిధులపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు కాకుండా కేసీఆర్ అడ్డుకుంటున్నారని అన్నారు. దీంతో ఎంతో మంది పేద ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కంది శ్రీరాములు, పులి బలరామ్ తదితరులు ఉన్నారు.

అఖండ భారత్ కోసం పోరాడిన ధీశాలి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, నాయకులు

నిజాంపేట్: అఖండ భారత్‌ను సాధించేందుకు జీవితాంతం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను శుక్రవారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ప్రొ. చంద్రమౌళి, పార్లమెంట్ కో.కన్వీనర్ రాజు, ఎస్టీ సెల్ జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కాశి, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, సెక్రటరీ శేషారావు, ప్రసాద్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్ నాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ట్రేడర్‌సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, హనుమయ్య, రంగరాజు, సాయి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

గండిమైసమ్మ చౌరస్తాలో..

దుండిగల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తునే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ అన్నారు. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు మహా జన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా గండిమైసమ్మ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేసే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాము గౌడ్, కృష్ణారెడ్డి, శ్యామ్ రావు, విగ్నేష్, శ్రీశైలం యాదవ్, సీతారాం రెడ్డి, వెంకటేష్ నాయక్, నరసింహ చారి, విజయ్, వీరేష్, రోజా, జంగారెడ్డి, మురళి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతల్ డివిజన్ వల్లభాయ్ పటేల్‌నగర్‌లో...


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

చింతల్: అఖండ భరతావని కోసం ప్రాణాలర్పించిన భారతమాత ముద్దుబిడ్డ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ వల్లభాయ్ పటేల్‌నగర్‌లో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఓబీసీ మోర్చా కో–కన్వీనర్ టి.రాము ఆధ్వర్యంలో శుక్రవారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మల్లారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాంతం జన సంఘ్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అఖండ భారత్ కోసం ముఖర్జీ కలలు కన్నారన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుచందర్, మీడియా సెల్ కన్వీనర్ సతీష్, లక్ష్మీపతి రాజు, పులి బలరామ్, డివిజన్ వైస్‌ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మందా లక్ష్మారెడ్డి, లెక్కల వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, సందీప్, ఇంద్రసేనారెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.